ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 15.04.2024 సమయం: 1340 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ, BJP రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఈరోజు రైతుదీక్ష చేపట్టారు.
2. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసుకి సంబంధించి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవితను ఢిల్లీ సిబిఐ కోర్టు ఈనెల 23వ తేదీ వరకు న్యాయ నిర్బంధానికి పంపింది.
3. ఇటీవల ప్రకటించిన BJP ఎన్నికల మ్యానిఫెస్టోలో ఒక్క అంశం కూడా బలహీన వర్గాల ప్రయోజనాలకు సంబంధించినది లేదని రాష్ట్ర BC సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.
4. మావోయిస్టు పార్టీ, ఐదు రాష్ట్రాల బంద్ కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో పోలీసు భద్రతను కట్టుదిట్టం చేశారు.

రైతు దీక్ష:

రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ, BJP రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ఈరోజు రైతుదీక్ష చేపట్టారు. హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో రైతు దీక్ష చేపడుతూ ఆయన.... ప్రజల్ని మభ్యపెట్టి ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, హామీలు అమలు చేయటంలో విఫలమైందని ఆరోపించారు. వరికి కనీస మద్దతు ధరకు అదనంగా బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన విషయం గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం 2 వేల 200 రూపాయిలకు పైగా కనీస మద్దతు ధర ప్రకటించగా, బోనస్ తో కలిపి 2 వేల 700 రూపాయలకు పైనే రైతులకు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కాంగ్రెసు ప్రభుత్వం మరచిపోయిందనీ ఆయన ఆరోపించారు. రైతు డిక్లరేషన్ అవాస్తవమైనదనీ విమర్శించారు. ఓటు కోసం కాంగ్రెసు నాయకులు వస్తే 2 లక్షల రూపాయిల ఋణ మాఫీ, 15 వేల రూపాయిల పెట్టుబడి హామీలపై నిలదీయాలని పిలుపు నిచ్చారు. రైతు కూలీలకు 12 వేల రూపాయిలు ఎప్పుడు ఇస్తారో చెప్పాలంటూ డిమాండు చేయాలని కోరారు. రాష్ట్రంలో పంటల బీమాను అమలుచేయక పోవటం వల్ల లక్షలాది మంది రైతులు నష్టపోయారనీ అన్నారు.

MSL

కవిత

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసుకి సంబంధించి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఢిల్లీ కోర్టు ఈనెల 23వ తేదీ వరకు న్యాయ నిర్బంధానికి పంపింది. మూడు రోజుల పోలీస్ కస్టడీ ముగియడంతో సిబిఐ కవితను ఈరోజు కోర్టులో హాజరు పరిచింది. మార్చి 15వ తేదీన ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కవితను అరెస్ట్ చేసిన విషయం శ్రోతలకు తెలుసు. అనంతరం మార్చి 23వ తేదీ వరకు కవిత సిబిఐ కస్టడీలో ఉన్నారు. అనంతరం ఈనెల 11వ తేదీన సిబిఐ ఆమెను మళ్ళీ అరెస్టు చేసి తీహార్ జైలుకు పంపింది.

ఎన్.ఎస్.డి.

పొన్నం – మ్యానిఫెస్టో

భారతీయ జనతా పార్టీ ఇటీవల ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలోని 14 అంశాల్లో ఒక్క అంశం కూడా బలహీన వర్గాలకు సంబంధించినది లేదని రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఈరోజు హైదరాబాద్ లో ఆయన ఒక ప్రకటన చేస్తూ... బిజెపి మ్యానిఫెస్టోను, కాంగ్రెస్ మ్యానిఫెస్టోను వెనుకబడిన తరగతుల వారు చదివి, ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో కుల గణన సర్వే చేస్తుందని, అలాగే అనేక కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఆయా వర్గాల వారికి ఆర్థిక పరిపుష్టి కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.

ఎస్.డి.పి

లోక్ సభ ఎన్నికలు

తెలంగాణాలో లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ ఎల్లుండి విడుదలవుతుంది. అదేరోజునుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై 25 వ తేదీ వరకు కొనసాగుతుంది. నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 26 వ తేదీన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు గడువు 29 వ తేదీ . రాష్ట్రంలోని 17 లోక్ సభ నియోజకవర్గాలకూ BJP, BRS పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకూ 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన స్థానాలకు ఒకటి రెండు రోజులలో ఆ పార్టీ అభ్యర్థులను ఖరారు చేయనుంది.

–డెస్క్

Election campaign:

లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలు తమ తమ అభ్యర్థులను ప్రకటించడంతో రాష్ట్రంలో పలు నియోజకవర్గాలలో అభ్యర్థులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. నాగర్ కర్నూలు బి.ఆర్.ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఈరోజు కల్వకుర్తి పట్టణంలో మార్నింగ్

వాక్ లో ఓటర్లను కలుసుకుని తమ పార్టీ విధానాలను వివరించారు. అనంతరం స్థానికులతో కలిసి చాయ్ పే చర్చలో పాల్గొన్నారు. ఆయనతోపాటు మార్నింగ్ వాక్ లో స్థానిక భారత రాష్ట్ర సమితి నాయకులు, స్వేరోస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ బీజేపీ వైపే ఉన్నారని, మూడో సారి ప్రధానిగా నరేంద్ర మోడీని ఎన్నుకోవాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రజలను కోరారు. ఈరోజు నిర్మల్ పట్టణం బంగాల్ పేట్ కాలనీ లో ఇంటిటికి ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున బీజేపీ సీట్లు కైవసం చేసుకుంటుదన్న ధీమా వ్యక్తంచేశారు.

వరంగల్ లోక్ సభ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు బిజెపి, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీల తరఫున పార్లమెంట్ ఎన్నికల పర్యవేక్షకులను నియమించాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్ పార్లమెంట్ ఎన్నికలకు కోఆర్డినేటర్ గా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్, మంత్రులు సురేఖ, సీతక్క తో పాటు, ఉమ్మడి జిల్లా నాయకులు సమన్వయం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇన్చార్జిగా నాయకులను సమన్వయం చేస్తున్నారు. బిజెపి, పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారిగా మురళీధర్ గౌడ్ క్షేత్ర స్థాయిలో నాయకులను సమన్వయం చేస్తున్నారు.

--పిటిసి,నాగర్ కర్నూల్,వరంగల్, నిర్మల్

Fire Week

రాష్ట్రంలో కొత్తగా 57 అగ్నిమాపక యంత్రాలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు విపత్తు నిర్వహణ అగ్నిమాపక సేవల డైరక్టర్ జనరల్ డిజి వై. నాగిరెడ్డి తెలిపారు. 30 కోట్ల రూపాయల వ్యయంతో 18 మినీ ,37 రెగ్యులర్ వాహనాలను కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 20 వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాలలో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన హైదరాబాద్ లో తెలిపారు.

అగ్నిప్రమాద సమయాల్లో, అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడుతారని, వారి సేవలు చెప్పుకోదగినవని, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జ్ అగ్నిమాపక శాఖ అధికారి టి.నరసింహాచారి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలో పలు ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాలలో ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అగ్ని ప్రమాదనివారణ పద్దతులను ప్రతీఒక్కరు పాటించి దేశ సంపదను కాపాడుకోవాలని నరసింహాచారి సూచించారు.

-పిటిసి, రాజన్నసిరిసిల్ల, అండ్ డెస్క్

జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు

అగ్ని ప్రమాదాల నివారణ, అదుపు చేసే విధానాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని వనపర్తి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర విపత్తు నివారణ బృందం, అగ్నిమాపక సేవల శాఖ అధికారి చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 14వ తేదీ నుండి ఏప్రిల్ 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వనపర్తి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

పిటిసి వనపర్తి

Nalgonda _seizure

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు జరిపిన తనిఖీలలో తగిన పత్రాలు లేని 9.17 కోట్ల రూపాయల విలువైన నగదు, మద్యం, బంగారం ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని నల్లగొండ జిల్లా ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్ జిల్లా చెక్ పోస్టులతో పాటు, ఆంధ్రా అధికారుల సమన్వయంతో అంతర్రాష్ట్ర

సరిహద్దులైన వాడపల్లి, అడవిదేవులపల్లి టెయిల్‌పాండ్, నాగార్జునసాగర్ వద్ద సమీక్రుత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2 కోట్లా 70 లక్షలరూపాయల నగదు, 23 లక్షలా10 వేల రూపాయల విలువైన మద్యం, 22వేల రూపాయల విలువ గల గంజాయి, 5కోట్లా73 లక్షల రూపాయల విలువ గల ఆభరణాలు, 51 లక్షల62 వేల రూపాయల విలువగల ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పిటిసి, నల్లగొండ

Maoist Bandh

మావోయిస్టు పార్టీ ,ఐదు రాష్ట్రాల బంద్ కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇటీవల ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్లతో తీవ్రంగా నష్టపోయిన మావోయిస్టులు, ఆయా ఎన్ కౌంటర్లను నిరసిస్తూ ఈ రోజు ఐదు రాష్ట్రాల బంద్ కు పిలుపునిచ్చారు. దీనితో భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పోలీస్ లు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా భద్రాద్రి, ములుగు జిల్లాల్లోని ఇసుక ర్యాంపులను పోలీసులు మూసివేశారు. అభివృద్ధి పనులను నిలిపివేశారు. హిట్ లిస్టులో ఉన్న వారిని, ప్రజా ప్రతినిధులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఛత్తీస్ గఢ్ సరిహద్దు అడవుల్లో పోలీసు బలగాలు గాలింపును ముమ్మరం చేశాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా బలగాలు భారీగా మోహరించాయి.

పిటిసి, ఖమ్మం

శ్రీరామనవమి......

ఎల్లుండి జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ రామాలయాలు ముస్తాబవుతున్నాయి. భద్రాచల సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో కల్యాణోత్సవానికి మిథిలా ప్రాంగణం ముస్తాబవుతోంది. పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి.
ఈ నెల 17న జానకిరాముల కళ్యాణోత్సవం, 18న రామయ్య పట్టాభిషేకం ఉత్సవాలను నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు దేశవ్యాప్తంగా అశేష సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా లడ్డూ ప్రసాదాలు, తలంబ్రాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి 22వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి.

పిటిసి, భద్రాద్రి, నాగర్ కర్నూల్

సీతమ్మకు సిరిసిల్ల చీర :

సీతారాముల కల్యాణోత్సవ వేళ భద్రాచలంలో జరిగే ఉత్సవాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ బంగారు పట్టుచీర నేశారు. 18 రోజులు శ్రమించి నేసిన ఈ పట్టుచీర త్రీడీ రంగులలో, రంగులు మారడం విశేషం. భద్రాచలంలో జరిగే వేడుకల్లో ఈ చీరను ఆలయ అధికారులకు అందించనున్నట్లు విజయ్ తెలిపారు. బంగారు వెండి, జరీ పోగు లతో 5.50 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పు, 600 గ్రా ములు ఉండే విధంగా చీరను తయారు చేశారు.

--రాజన్నసిరిసిల్ల జిల్లా

వేములవాడ

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి శ్రీలక్ష్మీఅనంతపద్మనాభస్వామివారు నిన్న రాత్రి నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమాలలో భాగంగా శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిటిసి రాజన్నసిరిసిల్ల

జాతీయ సదస్సు:

వికసిత్ కార్యక్రమంలో భాగంగా అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో ఈరోజు నుంచి 3 రోజులపాటు విద్యాభివృద్ధిపై ఉప కులపతుల జాతీయ స్థాయి సదస్సు హైదరాబాద్ లో జరుగుతోంది. ఉన్నత విద్యలో సాధించిన ప్రగతి- భవిష్యత్ లో సాధించాల్సిన అభివృద్ధి అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నారు. దేశ విదేశాలకు చెందిన 500 మంది ఉపకులపతులు ఈ సదస్సుకు హాజరవుతారు. 2047 నాటికి ఉన్నత విద్యా రంగంలో అభివృద్ధిని సాధించి , దేశ ప్రగతి మరింత పెంపొందించే లక్ష్యంతో చర్చలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ అధ్యక్షుడు జి.డి.శర్మ తెలిపారు.

–డెస్క్